సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 6 । మే । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 512 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



నేడు జెడ్పీ సమావేశం

ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ శుక్రవారం తెలిపారు.



జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

నవదంపతులకు ఆర్థికమస్తు

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నిధుల జమ
- జిల్లాలోని 440 జంటలకు లబ్ధి
- మెగా చెక్కు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే తిప్పేస్వామి



మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

పుట్టపర్తి అర్బన్: నవ దంపతుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. పెళ్లికోసం చేసిన అప్పులన్నీ తీర్చే మార్గం కనిపించడంతో సంతోషం ఉప్పొంగింది. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నిధులు శుక్రవారం అర్హుల ఖాతాల్లో జమ కాగా లబ్ధిదారుల ఇంట సంబరాలు నెలకొన్నాయి. ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయగా, 'లక్ష'ణమైన సాయం అందిందంటూ కుటుంబీకులు ఆనందపడ్డారు.

రూ.3.12 కోట్ల మెగా చెక్కు అందజేత..

నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించేందుకు అమలు చేస్తున్న వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నిధులను శుక్రవారం సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వివాహాలు చేసుకున్న వారిలో అర్హులైన జంటలు జిల్లాలో 440 ఉండగా, వారికి కలెక్టర్ అరుణ్‌బాబు, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎస్సీ వెల్ఫేర్ సూపరింటెండెంట్ మంజునాథ్, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీరాములు తదితరులు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మెగా చెక్కు అందజేశారు.

పథకాలతో జీవితాల్లో గొప్ప మార్పు..

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాలు నవదంపతుల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకువస్తాయన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వివాహాలు చేసుకున్న జంటలకు శుభాకాంక్షలు చెప్పారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాలకు జిల్లాలో 440 మంది అర్హులయ్యారన్నారు. ఇందులో ఎస్సీ కేటగిరీ కింద 76 మందికి రూ.లక్ష చొప్పున రూ.76 లక్షలు, ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకున్న ఒక జంటకు రూ.1.20 లక్షల లబ్ధి కలిగిందన్నారు. అలాగే ఎస్టీ కేటగిరీ కింద 25 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షలు ఖాతాల్లో జమ అయ్యాయని, బీసీ కేటగిరీ కింద 258 మంది లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున రూ.1.29 కోట్లు, ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకున్న ఆరుగురికి రూ.75 వేలు చొప్పున రూ.4.50 లక్షలు ఖాతాల్లో జమ చేశామన్నారు. మైనారిటీ కేటగిరీ కింద 66 మందికి రూ. లక్ష చొప్పున రూ.66 లక్షలు జమ చేశామన్నారు. దివ్యాంగుల కేటగిరీలో ఏడుగురికి రూ.1.50 లక్షల చొప్పున రూ.10.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల కేటగిరీలో ఒకరికి రూ.40 వేలు జమ చేసినట్లు వెల్లడించారు.

నాడు అరకొర... నేడు చెప్పినంత

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 'కళ్యాణమస్తు' లబ్ధిదారులకు అరకొరగా నిధులు కేటాయించే వారని, వాటినీ టీడీపీ నాయకులు ఆరగించారని మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి ఆరోపించారు. కళ్యాణమస్తు, షాదీతోఫా చెక్కు పంపిణీ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో ఏ పథకం కూడా సక్రమంగా అమలు కాలేదన్నారు. రైతులను, డ్వాక్రా మహిళలను, విద్యార్థులను, యువతను మోసగించారన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసిందన్నారు. సీఎం జగన్ పేద పిల్లలను చదివించడంతో పాటు వారికి ఒక అన్నలా, మామలా పెళ్లిళ్లు చేస్తున్నారని, ఇలాంటి ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా లేరన్నారు.

నా భార్యను చదివిస్తా..



మాకు 'కళ్యాణమస్తు' వర్తిస్తుందని అనుకోలేదు. అందరూ చెబుతున్నారని సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. అర్హులుగా గుర్తించి డబ్బు ఖాతాలో జమచేశారు. ఈ మొత్తంతో నా భార్య అలేఖ్యను పీజీ చేయిస్తా. సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లు చదువు ఉంటే అన్నీ సమకూర్చుకోవచ్చు. మాలాంటి పేదలకు ఇది పెద్ద వరం లాంటిది. – **రమేష్, మైలసముద్రం**

సాయం మరువలేం..



మేము పెళ్లి ఖర్చుల కోసం అప్పులు చేశాం. 'కళ్యాణమస్తు' నిధులతో వాటిని తీర్చుకుంటాం. నా భార్య కస్తూరిబాయికి బంగారు ఆభరణం బహుమతిగా ఇస్తా. చెల్లికి సొంత అన్న కూడా ఇవ్వలేని బహుమతి సీఎం వైఎస్ జగన్ మాకు ఇచ్చారు. ఆయన్ను జీవితాంతం గుర్తించుకుంటాం.

– **శివానాయక్, పెదపల్లి తండా**

అన్నలా తోడున్నారు..



మాది పేద కుటుంబం. పెళ్లి ఖర్చు చాలా భారం అనిపించింది. సీఎం జగనన్న అన్నలాగా మాకు 'కళ్యాణమస్తు' కింద రూ.లక్ష ఇచ్చి ఆదుకున్నారు. అలాగే మా కుటుంబానికి ఆసరా, జగనన్న తోడు పథకాలలో ఆర్థిక సాయం అందుతోంది. ఇలాంటి సీఎంను ఎన్నటికీ చూడలేము. ఈ డబ్బుతో ఇంటి నిర్మాణం చేపడతాం. – **అంజన్‌మూర్తి, అనూష దంపతులు, పైపల్లి**

ఎల్‌డీఎం నాగరాజారెడ్డి బదిలీ

- నూతన ఎల్‌డీఎంగా సత్యరాజ్



బి.నాగరాజారెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్ (ఎల్‌డీఎం) బి.నాగరాజారెడ్డి బెంగళూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏడాది కిందట జిల్లాకు వచ్చిన బి.నాగరాజారెడ్డి పంట రుణాలు, వ్యవసాయ, అనుబంధ రుణాల పంపిణీతో పాటు వార్షిక రుణప్రణాళిక వంద శాతం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. నాబార్డు సహకారంతో అన్ని ప్రధాన బ్యాంకులను సమన్వయం చేస్తూ జిల్లా అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేశారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొద్ది కాలం పాటు రెండు జిల్లాలకు సేవలందించారు. రెండు మూడు రోజుల్లో ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ కానున్నట్లు లీడ్ బ్యాంకు వర్గాలు తెలిపాయి. కాగా ఆయన స్థానంలో నూతన ఎల్‌డీఎంగా తమిళనాడు రాష్ట్రం ఊటీ ప్రాంతానికి చెందిన సత్యరాజ్‌ను నియమించినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు



అనంతపురం అగ్రికల్చర్: పచ్చిరొట్ట ఎరువులకు (గ్రీన్‌మెన్యూర్స్) ఉపయోగపడే జీలుగ (ధనించా) విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా జీలుగ విత్తనాల పూర్తి ధర రూ.7,950 కాగా అందులో రైతులు తమ వాటా కింద 50 శాతం రూ.3,900 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 10 కిలోల బస్తా రూపంలో వచ్చే జీలుగ విత్తనాలు భూమి విస్తీర్ణాన్ని బట్టి గరిష్టంగా ఐదు బస్తాలు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే జనుము (సన్‌హెంప్), పిల్లిపెసర విత్తన ధరలు, రాయితీలు ప్రకటించారన్నారు. అందులో జనుము క్వింటా రూ.8,400 కాగా రైతు వాటా రూ.4,200 గానూ, పిల్లిపెసర పూర్తి ధర రూ.9,700 కాగా అందులో రైతుల వాటా రూ.4,850 ఖరారు చేశారన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు ప్యాకెట్లు ఇస్తామని తెలిపారు. త్వరలోనే ఆర్బీకేల్లో తమ వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే సకాలంలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల ద్వారా పంటలకు మేలు జరిగేలా భూమిలో సేంద్రియ పోషకాలు బాగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

ఎరువుల ప్రణాళిక సిద్ధం



పుట్టపర్తి రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్న ఎరువులు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. గత సంవత్సరం 10,354 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయగా, ఈ ఏడాది 16,047 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో డీఏపీ 1,770 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 272 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3,191 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 824 మెట్రిక్ టన్నులు, యూరియా 9,990 మెట్రిక్ టన్నులు మేర సరఫరా చేయనున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తన పంపిణీ పూర్తి కాగానే పంటల సాగును అంచనా వేసి ఆయా గ్రామాల్లోని రైతులకు కావాల్సిన ఎరువులను సరఫరా చేయాలని అధికారులు భావిస్తున్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు ప్రశాంతం

- జిల్లా అధ్యక్షురాలిగా కాపు భారతి రెండోసారి ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు

అనంతపురం అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి ప్రభాకర్‌రెడ్డి, పరిశీలకులుగా సొసైటీ రాష్ట్ర సభ్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దస్తగిరి వ్యవహరించారు. ముందుగా ఎగ్జిక్యూటివ్ సభ్యుల స్థానాలకు 13 మంది నామినేషన్లు స్వీకరించారు. ఒక్కో స్థానానికి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కాగా, ఎన్నికల పరిశీలకులు అన్ని స్థానాలు ఏకగ్రీవమైనట్లు ప్రకటించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ సభ్యుల్లో ఒకరైన కాపు భారతిని జిల్లా అధ్యక్షురాలిగా రెండోసారి, డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్‌ను ఉపాధ్యక్షునిగా, ఎ.మల్లికార్జునను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే క్రమంలో సొసైటీ రాష్ట్ర సభ్యునిగా కాపు రామచంద్రారెడ్డిని ఎన్నుకున్నారు.

ఎగ్జిక్యూటివ్ సభ్యులు వీరే...

కాపు రామచంద్రారెడ్డి (రాష్ట్ర సభ్యుడు), కాపుభారతి (జిల్లా అధ్యక్షురాలు), డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్ (జిల్లా ఉపాధ్యక్షుడు), ఎ.మల్లికార్జున (కోశాధికారి), సుబ్రమణ్యం, హరిణి, జనార్దన్‌రెడ్డి, హనుమంతరావు, జనార్దన్, మనోరంజన్‌రెడ్డి, పృథ్వి, బద్రీనాథ్, హితేశ్‌కుమార్‌జైన్.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



మడకశిర మండలం ఛత్రంలో రైతు బీరన్న పొలంలో పంటను పరిశీలిస్తున్న మనోజ్ అహుజా బృందం



ఛత్రంలో రైతు బీరన్నతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకొంటున్న వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్‌అహుజా, అధికారులు

మడకశిర రూరల్/గుడిబండ: ప్రకృతి సేద్యంతో పెట్టుబడులు తగ్గి ఆదాయం రావడంతో పాటు అధిక దిగుబడులు సాధ్యమవుతాయని కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ అహుజా అన్నారు. శుక్రవారం ఆయన వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ జాయింట్ కార్యదర్శి యోగితా రాణా, కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ విజయ్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మానాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ తదితరులతో కలిసి మడకశిర, గుడిబండ మండలాల్లో పర్యటించారు. తొలుత వారు మడకశిర మండలంలోని ఛత్రం గ్రామంలో రైతు బీరన్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం కదిరేపల్లిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం మెళవాయిలో రాధమ్మ పొలంలో వివిధ రకాల విత్తనాల సాగును, సింగేపల్లిలో మహిళా రైతు వనిజమ్మ అలసందలు సాగులో సాలు పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే రైతులు పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. అందువల్లే కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి ఇక్కడికి వచ్చి రైతులు అవలంబిస్తున్న పద్ధతులు పరిశీలించారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతుల జీవితాల్లో భారీగా మార్పులు వచ్చాయని, పురుగు మందులు లేని వ్యవసాయం వల్ల కాలుష్యం తగ్గిందన్నారు. అంతకుముందు అధికారులు గుడిబండ మండలంలోని కెంచయ్యనపాళ్యం, కె.డి.పాళ్యం గ్రామాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నాగేంద్రప్ప, మంజులతో మాట్లాడి పంటలసాగులో వారు అవలంభిస్తున్న పద్ధతుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఏడీఏ కృష్ణమీనన్, ఏఓలు వీరనరేష్, తిమ్మప్ప, సర్పంచ్ రంగనాథ్, ఇన్‌చార్జి తహసీల్దార్ బాలాంజనేయులు, ఎంపీడీఓ సానిబాయి పాల్గొన్నారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పరిశీలన..

మడకశిర మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ అహుజా, రాష్ట్ర వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ యోగితా రాణా పరిశీలించారు. ల్యాబ్ నిర్వహణ గురించి ఆరా తీశారు. ల్యాబ్‌లో పురుగుమందులు, ఎరువులు, విత్తనాల నాణ్యతను పరీక్షించి ఫలితాలను ఆర్బీకేల ద్వారా రైతు ఇంటి వద్దకే అందిస్తామని ఏడీఏ కృష్ణమీనన్ వివరించారు.

నష్టాలు ఉండవు..

అనంతరం మడకశిర మండలం మెళవాయి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉమ్మడి జిల్లాల రైతులు, మహిళా సంఘాల సభ్యులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు, లాభాలు, పెట్టుబడి తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. మనోజ్‌అహుజా మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ మూల సూత్రాలను అర్థం చేసుకోగలిగితే వ్యవసాయంలో నష్టాలు ఉండవన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని అన్నిగ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తామన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

- అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి
- ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు



మహిళా పోలీసుకు అవార్డు అందజేస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన ఎస్పీ మాధవరెడ్డితో కలిసి పుట్టపర్తి సాయిఆరామంలో జిల్లాలోని మహిళా పోలీసులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ల వారీగా సమీక్షించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, మహిళా పోలీసులు రాకతో పోలీసు వ్యవస్థ ప్రజలకు మరింత చేరువైందన్నారు. గృహహింస, వరకట్న, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్ తదితర వాటిని అరికట్టేందుకు మహిళా పోలీసులు కృషి చేయాలన్నారు. చిన్న చిన్న గొడవలు, తగాదాలు పోలీస్‌స్టేషన్ వరకు రాకుండా అక్కడే పరిష్కరించాలని మహిళా పోలీసులకు సూచించారు. బాల్యవివాహాల నిరోధానికి తగు చర్యలు తీసుకోవాలని, దిశ యాప్ గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతినెల జరిగే క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో మహిళాపోలీసులకు అవార్డులు, రివార్డులు అందజేస్తామన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, మహిళా పోలీసులు తమ పరిధిలోని మహిళలతో తరచూ మాట్లాడుతూ ఉండాలన్నారు. మహిళలు, బాలికలు, పిల్లల హక్కులను కాపాడాలన్నారు. అనంతరం డీఐజీ అమ్మిరెడ్డి ఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీలు హుస్సేన్ పీరా, కంజాక్షన్, వాసుదేవన్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ విజయ కుమార్, సీఐలు లక్ష్మన్న, రవీంద్రరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ తనిఖీ

చిలమత్తూరు: జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌లో నిత్యం అప్రమత్తంగా ఉండాలని డీఐజీ అమ్మిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డితో కొడికొండ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ, ఎస్పీ స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డీఐజీ వెంట డీఎస్పీ కంజాక్షన్, సీఐ వేణుగోపాల్, ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

బుక్కపట్నం స్టేషన్ తనిఖీ..

పుట్టపర్తి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బుక్కపట్నం స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు గురించి ఆరా తీశారు. అనంతరం లాకప్ గదులు, స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. మట్కా, గ్యాంబ్లింగ్, ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంశ్రీతో పాఠశాలల సమగ్రాభివృద్ధి

- పాఠశాలల్లో సౌకర్యాలు, బోధన, అభ్యసన సామర్థ్యాల పెంపునకు చర్యలు
- ఎంపికైన ఒక్కో పాఠశాలకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల నిధులు
- జిల్లాలో 25 పాఠశాలలను ఎంపిక చేసిన కేంద్రం



పీఎం శ్రీ పథకానికి ఎంపికైన కొత్తచెరువు జెడ్పీ హైస్కూల్

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగ విప్లవానికి శ్రీకారం చుట్టారు. నాడు–నేడు మన బడి ద్వారా ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మారుస్తూ కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కృషికి కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తోడవడంతో రాష్ట్రంలో పాఠశాలల స్థితిగతులు మరింత మెరుగుపడనున్నాయి. ''ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా'' (పీఎంశ్రీ) పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి బాటలు వేయనుంది. నూతన జాతీయ విద్యా విధానం నియమ నిబంధనలను మేరకు పాఠశాలల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పీఎం శ్రీ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. తొలివిడతగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 25 పాఠశాలలను ఎంపిక చేశారు.

పీఎంశ్రీ ద్వారా పాఠశాలలకు మెరుగులు..

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాల సమగ్రాభివృద్ధికి కేంద్రం ఐదేళ్ల పాటు నిధులు అందజేయనుంది. పాఠశాలల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం 66 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 34 శాతం నిధులను సమకూరుస్తాయి. ఈ నిధుల ద్వారా పాఠశాలల్లో సౌకర్యాల పెంపు, విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా కార్యక్రమాలను రూపొందిస్తారు. స్మార్ట్ క్లాస్‌రూంలు, డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు, అత్యాధునిక ల్యాబొరేటరీ ఏర్పాటుతో పాటు విద్యార్థుల్లో క్రీడా సామర్థ్యం పెంపుకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తారు. ఆధునిక విద్యావిధానానికి అనుగుణంగా డిజిటల్ బోధన, ఉపాధ్యాయులకు శిక్షణ వంటి కార్యక్రమాలకు నిధులు వినియోగించాల్సి ఉంటుంది. స్కూళ్లను పర్యావరణ హితంగా గ్రీన్ స్కూల్స్‌గా తీర్చిదిద్దడంతో పాటు సోలార్ ప్యానెళ్లు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసేలా చూస్తారు. పాఠశాలలను ప్లాస్టిక్ రహితంగా మార్చేలా పాఠశాల ఆవరణలో విద్యార్థులు ,ఉపాధ్యాయులు సంయుక్తంగా సేంద్రియ వ్యవసాయం చేస్తూ పెరటి పంటలు పండించేలా కార్యక్రమాన్ని చేపడతారు. ప్రకృతి సంరక్షణకు ఆచరించాల్సిన పద్ధతులను విద్యార్థులకు తప్పనిసరిగా నేర్పిస్తారు. ఒక్కో పాఠశాలకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లను ఖర్చు చేయనున్నారు.

ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతాం



రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపరచి నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో పనిచేస్తోంది. పీఎంశ్రీ ద్వారా జిల్లాలో 25 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతు సహకారాన్ని అందించనుండటంతో సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. నూతన జాతీయ విద్యావిధానం మేరకు ఆశించిన ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చక్కటి అవకాశం ఏర్పడింది. – మీనాక్షి, డీఈఓ

క్లుప్తంగా

వైభవంగా మల్లెపూల ఉత్సవం


ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కదిరి టౌన్: పట్టణంలోని మద్దిలేరు వాగు వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపం వెనుక ఉన్న మల్లెపూల మండపం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామికి వైభవంగా మల్లెపూల ఉత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయం నుంచి స్వామివారిని ఊరేగింపుగా మల్లెపూల మండపం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్వామివారిని మల్లెపూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదారులుగా కీర్తిశేషులు నరసయ్య కుమారులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ పట్టెం గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయం అద్భుతం


ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న డీఐజీ, ఎస్పీ

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం అద్భుతంగా ఉందని డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ ఎస్వీ.మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాలను తిలకించారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విజయనగర రాజుల కాలం నాటి దేవాలయాన్ని సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. డీఎస్పీ కంజాక్షన్, ఎస్ఐ మునీర్‌అహమ్మద్ వారి వెంట ఉన్నారు.

చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం టౌన్: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా బాధితులకు మంజూరైన చెక్కులను శుక్రవారం హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అందజేశారు. అనంతపురంలోని ఎంపీ నివాసంలో బాధితులు లక్ష్మీదేవికి రూ.28 వేలు, హేమలతకు రూ.65 వేలు, శివాజీకి రూ.80 వేల చొప్పున చెక్కుల రూపంలో బాధితులకు పంపిణీ చేశారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ పనుల పరిశీలన


డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని పొడరాళ్లపల్లి, రామస్వామి తండాల్లో నాడు–నేడు కింద జరుగుతున్న విలేజ్ హెల్త్ క్లినిక్ పనులను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. అదే విధంగా పొడరాళ్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, చిన్నారులకు అందుతున్న పోషకాహారాలు, మందులను పరిశీలించారు. అదే విధంగా జొన్నలకొత్తపల్లిలో జరుగుతున్న 'ఫ్యామిలీ ఫిజిషియన్' కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్పనాయక్, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం


భక్తజనసందోహం నడుమ సంగమేశ్వరస్వామి రథోత్సవం

కొత్తచెరువు: ఓం నమఃశివాయ అన్న నామస్మరణతో కొత్తచెరువు పులకించింది. సంగమేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుండే బుక్కపట్నం రహదారిలో వెలసిన సంగమేశ్వర దేవాలయం కిటకిటలాడింది. ఉదయం నుంచే స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు రథంపై పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను కొలువు దీర్చారు. పూజల అనంతరం భక్తుల జయ జయధ్వానాల మధ్య రథోత్సవం జరిగింది.

రైల్వే అధికారులకు తప్పుడు సమాచారం

- కటకటాల పాలైన యువకుడు


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

ధర్మవరం: తప్పుడు సమాచారం ఇచ్చి రైలు ఆలస్యంగా నడిచేందుకు కారణమైన ఓ యువకుడు కటకటాల పాలయ్యాడు. స్థానిక రైల్వే జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మవరం రైల్వే సీఐ నాగరాజు, ఎస్ఐ గోపికుమార్ ఆ వివరాలను వెల్లడించారు. వారి వివరాలమేరకు.. తలుపుల మండలం గొల్లపల్లి తండాకు చెందిన దేవలానాయక్ కుమారుడు తేజేశ్వర్‌నాయక్ ఈనెల 3న కదిరి రైల్వేస్టేషన్‌లో రైలు కదిలే సమయంలో కదిరి నుంచి నల్లచెరువు వెళ్లే రైలు మార్గం డ్యామేజీ అయిందని కదిరి రైల్వేస్టేషన్ మాస్టర్‌కు అజ్ఞాత వ్యక్తిగా ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో రైల్వే అధికారులు రైలును 65 నిమిషాల పాటు ఆపి లైన్ చెక్ చేశారు. అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో రైలు సజావుగా వెళ్లింది. అయితే తప్పుడు సమాచారం ఇచ్చి రైల్వే అధికారుల సమయాన్ని వృథా చేయడమే కాకుండా ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించిన అజ్ఞాత వ్యక్తి ఎవరని దర్యాప్తు చేశారు. దీనిపై కదిరి ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. విచారణ అనంతరం తప్పుడు సమాచారం ఇచ్చిన తేజేశ్వర్‌నాయక్‌ను అరెస్టు చేశారు. రైల్వే అధికారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే ఎవరిని ఉపేక్షించబోమని రైల్వే అధికారులు హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ బోయకుమార్, కదిరి రైల్వే ఎస్ఐ రహీం, ఏఎస్ఐ శివారెడ్డి, రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి


హొట్టేబెట్ట ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ విజయ్‌కుమార్

రొళ్ల: నాడు–నేడు పనులను త్వరితగతిన పనులు పూర్తిచేయాలని జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కె.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు కింద నిర్మాణం దశలో ఉన్న వంటగది, మరుగుదొడ్లను ఇతరాత్ర అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత పాఠశాలలలో రికార్డులు తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా నాడు–నేడు పనులను పూర్తిచేయాలన్నారు.

కియా ఉద్యోగి ఆత్మహత్య

ప్రశాంతి నిలయం : కుటుంబ కలహాలతో కియా ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పుట్టపర్తి పట్టణంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పుట్టపర్తి అర్బన్ పోలీసుల వివరాలమేరకు... బీడుపల్లికి చెందిన శ్రీనాథ్ (26)కు రెండేళ్ల క్రితం కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన స్వాతితో వివాహమైంది. ఉద్యోగ రీత్యా శ్రీనాథ్ కాపురాన్ని పుట్టపర్తికి మార్చారు. భార్యభర్తల మధ్య పలుమార్లు విభేదాలు తలెత్తగా పెద్ద మనుషుల సమక్షంలో సర్దిజెప్పారు. అయితే విభేదాలు తారస్థాయికి వెళ్లడంతో మనస్థాపానికి గురైన శ్రీనాథ్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్రీనాథ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాల సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత..


మృతురాలు షబియా

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని మశానంపేటకు చెందిన జిలాన్ భార్య షబియా (26) శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ పోలీసుల వివరాలమేరకు... డ్రైవర్‌గా పనిచేస్తున్న జిలాన్‌తో షబియాకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే కొద్ది రోజులుగా కుటుంబ కలహాల కారణంగా తరచూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షబియా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి తలుపులు తెరచి ఆమెను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పట్టణ సీఐ మధు పరిశీలించారు. షబియా తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీఆర్‌ఓల జిల్లా నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వీఆర్‌ఓల జిల్లా నూతన అధ్యక్ష కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలో సాయి ఆరామంలో అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షుడు పాటిల్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా వీఆర్‌ఓల సమావేశం ఏర్పాటు చేసి శ్రీసత్యసాయి జిల్లా నూతన వీఆర్‌ఓల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణరెడ్డి, అధ్యక్షుడిగా మహేశ్వర్ రెడ్డి, సహాధ్యక్షుడిగా రవీంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రజినీకాంత్‌రెడ్డి, మారుతీప్రసాద్, నాగరాజు, ఇనయతుల్లా, యజ్ఞ, జనరల్ సెక్రటరీలుగా బషీర్, అంజనేయులు, జాయింట్ సెక్రటరీలుగా జయప్రకాశ్, మనోహర్, శివయ్య, శ్రీరాములు, హరిత, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా లక్ష్మీనారాయణ, చెన్నకేశవులు, రామాంజనేయులు, రజిత్‌భార్గవ్, కోశాధికారిగా చాంద్‌బాషా, నాగేంద్రబాబు, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు.

సాయి మార్గమే బౌద్ధ తత్వం

ప్రశాంతి నిలయం: ఆ నాడు బుద్ధ భగవానుడు బోధించిన బోధనలను సత్యసాయి ఆచరించి చూపారు.. సత్యసాయి, బుద్ధ భగవానుల బోధన సారం ఒక్కటేనని పలువురు బౌద్ధ సన్యాసులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. నేపాల్, శ్రీలంక, భూటాన్, బంగ్లాదేశ్, కాంబోడియా, ఇండోనేషియా, సింగపూర్, మలేసియా, తైవాన్, థాయిలాండ్, బ్రూనై, వియత్నాం, జపాన్, హాంగ్‌కాంగ్, చైనా దేశాలకు చెందిన భిక్షులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు.

పుష్ప మండపంపై చెన్నకేశవస్వామి


పుష్ప మండపంపై ఊరేగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి శుక్రవారం పుష్ప మండపంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదోరోజు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వివిధ రకాల పూలతో తయారు చేసిన పుష్ప మండపంపై స్వామిని పురవీధులలో ఊరేగించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలకు పసుపు, కుంకుమ, వివిధ రకాల రంగులతో వసంతోత్సవం జరిపించారు. ఉభయ దాతల ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు హంస వాహనంపై చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం సాయంత్రం 6 గంటలకు దేవతా ఉద్వాసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి


వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు


వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- రాప్తాడును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం
- త్వరలోనే మహిళా సహకార డెయిరీని ప్రారంభిస్తాం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత , పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే పథకాల డబ్బును జమ చేశాం. ప్రభుత్వం నుంచే కాకుండా తోపుదుర్తి కుటుంబం ద్వారా ఎన్నో ఉచిత బోర్లు వేశాం. సొంత నిధులతో ఆలయాలకు, మసీదుల అభివృద్ధికి సహకరించాం. మహిళల అభ్యున్నతికి స్థలం కొనుగోలు చేసి డెయిరీ మిషన్లు ఏర్పాటు చేయించాం. తోపుదుర్తి సహకార డెయిరీకి సంబంధించి ట్రయల్‌రన్ కూడా చేశాం. త్వరలోనే డెయిరీని ప్రారంభిస్తాం. అభివృద్ధిని చూసే ఓటు వేయండి' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరులో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా డ్వాక్రా సంఘాల మహిళలతో కలసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పరిటాల సునీత చేసిన అభివృద్ధి శూన్యం..

గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన పరిటాల సునీత నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల ఇబ్బందులు తెలుసుకొని ఇచ్చిన మాట ప్రకారమే పేరూరు డ్యాంకు నీరు తెచ్చామని , గత 30 ఏళ్లుగా నీరు రాని చెరువులకు నీరు అందజేశామన్నారు. గ్రామాల్లో సమస్యాత్మకంగా ఉన్న విద్యుత్ స్తంభాలకు సొంతంగా రూ.10 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు.

హెరిటేజ్‌తో రూ.40 వేల కోట్ల దోపిడీ..

రూ. కోట్లతో ఏర్పాటు చేసిన మహిళా సహకార డెయిరీకి సంబంధించి ఇటీవల ట్రయల్ రన్ పూర్తయింది. ముఖ్యమంత్రి జగనన్న చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. డెయిరీ ద్వారా నియోజకవర్గంలోని 10 వేల మందికి లబ్ధి చేకూరబోతోందన్నారు. హెరిటేజ్ డెయిరీ ద్వారా 25 ఏళ్లలో కేవలం పాల మీదనే మాజీ సీఎం చంద్రబాబు రూ.40 వేల కోట్లను దోచుకున్నారని విమర్శించారు. సహకార డెయిరీలో లీటరు పాలు రూ.45తో కొనుగోలు చేస్తామన్నారు.

లోకేష్‌వన్నీ తప్పుడు మాటలే...

ఎన్నికల లోపు నియోజకవర్గంలో రెండు రిజర్వాయర్లు పూర్తి చేయాలని సీఎం జగనన్న కోరామని ఎమ్మెల్యే తెలిపారు. జాకీ పరిశ్రమ ప్రకాష్‌రెడ్డి వల్లనే పోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తప్పుడు కూతలు కుస్తున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జాకీ పరిశ్రమకు భూములు ఇచ్చారన్నారు. రూ.140 కోట్ల విలువ చేసే 28 ఎకరాల భూమిని కేవలం రూ.2 కోట్లకు ఇచ్చారని చెప్పారు. ఎవడబ్బ సొమ్మని అంత తక్కువకు విక్రయించారని మండిపడ్డారు. బినామీ సంస్థను అడ్డుపెట్టుకొని విలువైన భూమిని కొట్టేశారని విమర్శించారు. ఆ భూమిని తమకు అప్పచెబితే ఆరు నెలల్లో 8 ఎకరాల్లో గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, మిగిలిన 20 ఎకరాలు అమ్మితే తోపుదుర్తి రిజర్వాయర్‌ను కూడా ఉచితంగా నిర్మిస్తామని తెలిపారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం..

మండలంలో ఎక్కడా నీటి సమస్య ఉన్నా వెంటనే బోర్లు వేయాని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలుగా పనిచేసినా ఆత్మకూరు మండలానికి నీటి సమస్య పరిష్కరించలేకపోయారని, అయితే పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు వరకు, అలాగే ఆత్మకూరు నుంచి అనంతపురం రూరల్ పాపంపేట వరకు రూ.93 కోట్లతో పైప్ లైన్ పనులకు టెండర్లకు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, ఎంపీపీలు హేమలత, అంజలి, జెడ్పీటీసీ మారుతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బాలపోతన్న, మండల సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, వాసుదేవరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	695	61,054
నిఫ్టీ ▽	187	18,069

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,210	△	224
డోజోన్స్	33,580	△	453
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,778	△	76
డాక్స్	15,961	△	227
షాంఘై	3,334	▽	16
నికాయ్	29,158	△	35

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,923	△	277
బంగారం (99.5 స్వచ్ఛత)	61,979	△	279
వెండి (కేజీ)	76,794	△	330

ఒలెక్ట్రా ఆదాయం రూ. 376 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 376 కోట్ల ఆదాయం (కన్సాలిడేటెడ్)పై రూ. 27 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఆదాయం రూ. 271 కోట్లుగా, లాభం రూ. 18 కోట్లుగా నమోదైంది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 84 శాతం ఎగిసి రూ. 594 కోట్ల నుంచి రూ. 1,091 కోట్లకు చేరింది. నికర లాభం 86 శాతం వృద్ధితో రూ. 35 కోట్ల నుంచి రూ. 66 కోట్లకు పెరిగింది. 2021–22లో 259 ఎలక్ట్రిక్ బస్సులు డెలివరీ చేయగా, 2022–23లో 117 శాతం అధికంగా 563 ఈ–బస్సులను అందించినట్లు సంస్థ తెలిపింది. మొత్తం 3,394 బస్సుల కోసం ఆర్డర్లు ఉన్నట్లు వివరించింది. ఎలక్ట్రిక్ టిప్పర్లను కూడా విక్రయించడం ప్రారంభించామని, క్యూ4లో 17 వాహనాలను డెలివరీ చేశామని పేర్కొంది. సరఫరా వ్యవస్థ, స్థూల పరిస్థితులపరమైన రిస్కులు నెలకొన్నప్పటికీ తాము తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కె.వి. ప్రదీప్ తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల విభాగంలో అగ్రగామిగా కొనసాగేందుకు ఇది తోడ్పడుతోందని ఆయన పేర్కొన్నారు.

పతంజలి 'వెయిట్‌గో' తో సత్ఫలితాలు

హైదరాబాద్: బరువు తగ్గించడంలో తాము అభివృద్ధి చేసిన 'దివ్య వెయిట్‌గో' సత్ఫలితాలను ఇస్తున్నట్లు పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ తెలిపింది. తేలిక పాటి వ్యాయామాలు చేస్తూ, ఈ ఆయుర్వేదిక్ ఔషధాన్ని వినియోగిస్తే శరీరంలోని కొలెస్ట్రాల్, గ్లూకోజ్, ఇన్సులిన్‌లను తగిన స్థాయిల్లో ఉండేలా



చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ జర్నల్ 'బయోమెడిషన్ అండ్ ఫార్మాకో థెరపీ'లో ఈ ఔషధం పనితీరు గురించి ప్రచురితమైనట్లు వివరించింది.

మనీ లాండరింగ్ పరిధిలోకి సీఏలు

- పీఎంఎల్‌ఏ కిందికి కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు
- అయిదు రకాల ఆర్థిక లావాదేవీలకు వర్తింపు
- కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: నల్ల ధనం చలామణీ, మనీ లాండరింగ్ కార్యకలాపాలను నిరోధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన కేంద్రం ఆ దిశగా మరో కీలక చర్య తీసుకుంది. బ్లాక్ మనీ చలామణీకి ఆస్కారం ఉండే అయిదు రకాల ఆర్థిక లావాదేవీలను, వాటిని క్లయింట్ల తరఫున నిర్వహించే చార్టర్డ్ అకౌంటెంట్లు, కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలను మనీ–లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) పరిధిలోకి చేర్చింది. దీంతో ఇకపై సదరు లావాదేవీలను నిర్వహించే సీఏలు, సీఎస్‌లు కూడా విచారణ ఎదుర్కొనాల్సి రానుంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మే 3న నోటిఫికేషన్ విడుదల చేసింది. స్థిరాస్తుల కొనుగోలు, విక్రయం; క్లయింట్ల డబ్బు, సెక్యూరిటీలు లేదా ఇతర ఆస్తుల నిర్వహణ; బ్యాంక్, సేవింగ్స్ లేదా సెక్యూరిటీస్ అకౌంట్ల నిర్వహణ; కంపెనీల ఏర్పాటు, నిర్వహణ కోసం నిధులు సమీకరించడంలో తోడ్పాటు; వ్యాపార సంస్థల కొనుగోళ్లు, విక్రయం.. మొదలైన అయిదు రకాల ఆర్థిక లావాదేవీలు ఇందులో ఉన్నాయి. పీఎంఎల్‌ఏ చట్టం 2002ను ప్రయోగించాల్సి వస్తే క్లయింట్ల స్థాయిలోనే సీఏలు కూడా జరిమానా, విచారణ ఎదుర్కొనాల్సి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'పీఎంఎల్‌ఏ నిబంధనలను అమలు చేస్తే క్లయింట్లతో సమానంగా సీఏలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా లావాదేవీ జరిగినట్లుగా భావిస్తే ఆ విషయాన్ని సీఏలు వెంటనే నియంత్రణా సంస్థకు తెలియజేయాలి' అని వివరించాయి.

రిపోర్టింగ్ అధికారులుగా సీఏలు..

ఆయా లావాదేవీల విషయంలో సీఏలు ఇకపై నియంత్రణ సంస్థలకు తెలియజేయాల్సిన రిపోర్టింగ్ అధికారులుగా వ్యవహరించాల్సి ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) పేర్కొంది. సదరు లావాదేవీలు నిర్వహించే క్లయింట్లందరి వివరాలను సేకరించి (కేవైసీ), రికార్డులను నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని తెలిపింది. క్లయింట్ల తరఫున ఏయే ఆర్థిక లావాదేవీలు జరపకుండా నిషేధం ఉందనే దాని గురించి తమ సభ్యుల్లో అవగాహన కలిగించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీఏఐ వివరించింది. కొత్త మార్పులు సరైన కోణంలో అమలయ్యేలా చూసేందుకు, వృత్తి నిపుణులు పోషించగలిగే పాత్ర అర్థమయ్యేలా వివరించేందుకు నియంత్రణ సంస్థలు, అధికారులతో కలిసి పనిచేయనున్నట్లు ఐసీఏఐ తెలిపింది. నల్ల ధనం కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పీఎంఎల్‌ఏ నిబంధనలను కఠినతరం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు .. రాజకీయాలతో ప్రమేయమున్న వ్యక్తుల (పీఈపీ) ఆర్థిక లావాదేవీలను రికార్డు చేయడాన్ని తప్పనిసరి చేసింది. అలాగే లాభాపేక్ష రహిత సంస్థల ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని కూడా ఆర్థిక సంస్థలు, రిపోర్టింగ్ ఏజెన్సీలు సేకరించాల్సి ఉంటోంది. ఇక వర్చువల్ అసెట్స్ లావాదేవీలు నిర్వహించే క్రిప్టో ఎక్స్చేంజీలు, మధ్యవర్తిత్వ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించే యూజర్ల వివరాలను సేకరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.



ఫెడరల్ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 954 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 954 కోట్ల నికర లాభం ఆర్జించింది. 62 శాతం ఎగసింది. ఇది ఒక త్రైమాసికానికి బ్యాంక్ చరిత్రలోనే అత్యధికం కాగా.. ఇందుకు పెట్టుబడుల విక్రయ లాభాలు దోహదపడినట్లు బ్యాంక్ పేర్కొంది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 61 శాతం ఎగసి రూ. 3,165 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) రూ. 1,970 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 25 శాతం పుంజుకుని రూ. 1,909 కోట్లను అధిగమించింది. ఇతర ఆదాయం 58 శాతం ఎగసి రూ. 734 కోట్లను తాకింది. దీంతో రికార్డ్ లాభం ఆర్జించినట్లు బ్యాంక్ వెల్లడించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.78 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గాయి.



సూచీలకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షాక్..!

- వారాంతాన ఒక శాతం పతనమైన మార్కెట్
- సెన్సెక్స్ నష్టం 695 పాయింట్లు
- 18,100 దిగువకు నిఫ్టీ

ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల ద్వయం 66% పతనంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. విలీన ప్రక్రియ తర్వాత సుమారు 150 – 200 మిలియన్ డాలర్ల మేర అవుట్‌ఫ్లో ఉండొచ్చని ఎంఎస్‌సీఐ నివేదిక తెలపడంతో ఇరు కంపెనీల షేర్లు గడిచిన మూడేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. అలాగే అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ భయాలు, వాల్ స్ట్రీట్ నుంచి బలహీన సంకేతాలు, ఈసీబీ పావుశాతం వడ్డీరేట్ల పెంపుతో పాటు వారాంతపు రోజు కావడంతో ట్రేడర్లు కీలక కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్ ఉదయం 586 పాయింట్ల నష్టంతో 61,163 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ఒక దశలో 747 పాయింట్లు క్షీణించి 61,002 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 696 పాయింట్లు నష్టపోయి 61,054 వద్ద ముగిసింది. నిఫ్టీ 139 పాయింట్ల పతనంతో 18,117 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 18,217 – 18,055 పరిధిలో కదలాడింది. ఆఖరికి 187 పాయింట్లు నష్టపోయి 18,069 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్, మీడియా, ఐటీ రంగాల షేర్లకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్ల పతనంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.50%, 0.30% చొప్పున నష్టపోయాయి. కాగా ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగానూ, యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.43 లక్షల కోట్లు హరించుకుపోయింది.



- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 5.63% పతనంతో రూ.1625 వద్ద నిలిచింది. బ్యాంక్ రూ.56,228 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. హెచ్‌డీఎఫ్‌సీ 5.84% నష్టంతో రూ.1625 వద్ద క్లోజైంది. రూ.29,572 కోట్ల మార్కెట్ క్యాప్ ఆవిరైంది.

బంగారం డిమాండ్‌కు ధర సెగ

- భారత్ వినియోగదారుల కొనుగోళ్లు వాయిదా
- జనవరి–మార్చిలో డిమాండ్ 17 శాతం డౌన్
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక

ముంబై: దేశంలో బంగారం ధరలు తీవ్ర స్థాయికి చేరడంతో, జనవరి–మార్చి త్రైమాసికంలో డిమాండ్ భారీగా 17 శాతం పడిపోయింది. వినియోగదారులు తీవ్ర ధరల కారణంగా కొనుగోళ్లను వాయిదా వేసుకునే పరిస్థితి నెలకొంది. 'మొదటి త్రైమాసికంలో పసిడి డిమాండ్ ట్రెండ్స్' పేరుతో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన ఒక నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు...

- ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో భారత్ పసిడి డిమాండ్ 112.5 టన్నులు. 2022 ఇదే కాలంలో ఈ విలువ 135.5 టన్నులు.
- పసిడి ఆభరణాల డిమాండ్ ఇదే కాలంలో 94.2 టన్నుల నుంచి 78 టన్నులకు పడిపోయింది. 2010 నుంచి ఒక్క మహమ్మారి కరోనా కాలాన్ని మినహాయిస్తే పసిడి ఆభరణాల డిమాండ్ మొదటి త్రైమాసికంలో 100 టన్నుల దిగువకు పడిపోవడం ఇది నాల్గవసారి.



- విలువల రూపంలో చూస్తే, మొత్తంగా పసిడి కొనుగోళ్లు 9 శాతం క్షీణించి రూ.61,540 కోట్ల నుంచి రూ.56,220 కోట్లకు పడిపోయాయి.
- ఒక్క ఆభరణాల డిమాండ్ విలువల్లో చూస్తే, 9 శాతం పడిపోయి రూ.42,800 కోట్ల నుంచి రూ.39,000 కోట్లకు పడిపోయాయి.
- పెట్టుబడుల పరిమాణం పరంగా డిమాండ్ (కడ్డీలు, నాణేలు) 17 శాతం తగ్గి 41.3 టన్నుల నుంచి 34.4 టన్నులకు క్షీణించింది.

ప్రపంచ పసిడి డిమాండ్ కూడా మైనస్సే..

ఇదిలావుండగా, ప్రపంచ వ్యాప్తంగా కూడా పసిడి డిమాండ్ మొదటి త్రైమాసికంలో బలహీనంగానే నమోదయ్యింది. 13 శాతం క్షీణతతో ఈ పరిమాణం 1,080.8 టన్నులుగా ఉంది.

రూపాయి ఎఫెక్ట్...



పసిడి ధరలు పెరడానికి అంతర్జాతీయ అంశాలు ప్రధాన కారణంగా కనబడుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడ్ ఫండ్ రేటు పెరుగుదలను ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. డాలర్ బలోపేతం, రూపాయి బలహీనత వంటి కారణాలతో గత ఏడాదితో పోల్చితే పసిడి ధర 19 శాతం పెరిగింది. పసిడి 10 గ్రాముల (స్వచ్ఛత) ధర రూ.60,000 పైన నిలకడగా కొనసాగుతోంది. ధర తీవ్రతతో తప్పనిసరి పసిడి అవసరాలకు వినియోగదారులు తమ పాత ఆభరణాల రీసైక్లింగ్, తద్వారా కొత్త కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెట్టుబడులకు సంబంధించి డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫామ్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ విభాగంలో కొనుగోళ్ల పరిమాణాలు కొంత మెరుగుపడుతున్నాయి. డిమాండ్ వార్షికంగా 750 నుంచి 800 టన్నులు శ్రేణిలో నమోదుకావచ్చు.

– సోమసుందరం, డబ్ల్యూజీసీ భారత్ రీజినల్ సీఈఓ.

లైఫ్@360

మే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు...

• వడదెబ్బ జాగ్రత్త పడదాం ఇలా...



ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది. శరీరంలో నీటిశాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది. అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి. ఇంకా ఎండల్లో ఎక్కువ తిరగకుండా ఉండాలి. అధికంగా ఎండలో తిరగటంతో రక్తకణాలు కుంచించుకు పోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం.

ఎలా గుర్తించాలి?

• చర్మం పొడిబారుతుంది. కళ్లు మంటలు రావడం, గుంజినట్లు అవడం జరుగుతుంది. • శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపుతప్పతుంది. • నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది. • వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు అవుతాయి. • శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం వస్తుంది. • దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి ముప్పు ఏర్పడుతుంది.

ఎవరిపై ఎక్కువ ప్రభావం?

60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగే వాళ్లు, అతిగా ఔషధాలు తీసుకొనేవారు జాగ్రత్తగా ఉండాలి. వేసవి లో ఎక్కువ సేపు ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి వారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

ముందుజాగ్రత్తలు ఏమిటి?



• ప్రతిరోజు మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి. • ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి. • రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. • సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి. • ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి. • వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. • నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. • కొబ్బరి బోండాం, మజ్జిగ తాగండి. • బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి. • అలాగే నీళ్ల బాటిల్ తీసుకెళ్లండి. • మధ్యాహ్నం 12 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు. • కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడంవల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. మలబద్ధక సమస్య కూడా తగ్గుతుంది. • శరీరంలో నీటిశాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి. • వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి. • జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది. • ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, పండ్ల రసాలు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

• నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ తగలడం వలన కలిగిన బాధలు తగ్గుతాయి. • వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటిమీద నీళ్లు చల్లుతూ ఉండాలి. నిమ్మరసంలో ఉప్పు కలిపి ఇవ్వాలి. • కుమ్ముున ఉడికించిన మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు. • శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి. • గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇస్తే ఉపశమనం కలుగుతుంది. • తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి. • లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి. • నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగలో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి. • వేడివేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి. • బయటకు వెళ్లేటప్పుడు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగడం మంచిది. • వీలయినంత వరకు ఎండవేళలో బయటికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.



కర్బూజ పండంటి ఆరోగ్యం

వేసవిలో మనకు అధికంగా దొరికే పండు ఖర్బూజ పండు. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. కర్బూజలో దాదాపు తొంబై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటిని తిరిగి అందించడంలో కర్బూజపండు బాగా ఉపయోగపడుతుంది. ఈ పండు ముఖ్యంగా శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.



- కర్బూజ పండులో ఎక్కువ శాతంగా ఉండే బీటాకెరోటిన్, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలోని తెల్ల రక్తకణాలను వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడతాయి.
- కర్బూజలో విటమిన్ ఎ ఎక్కువగా ఉండటం వల్ల కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. దీనివలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా పని చేసేలా ఉపయోగపడుతుంది.
- ఈ పండులో అధిక మోతాదులో పొటాషియం ఉండటం వలన గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలెట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి, గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- తక్కువ క్యాలరీస్, ఎక్కువ పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- ఖర్బూజ జ్యూస్ తాగడం వలన మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణ శక్తిని మెరుగుపరుస్తుంది.
- ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యం, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది. వేసవిలో కర్బూజ పండు ముక్కలతోపాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.

వ్యాధులనుంచి కాపాడుకుందాం

పోయిందనుకున్న కోవిడ్ ఇప్పుడు మళ్లీ ప్రభావం చూపిస్తోంది. కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే భయ పడాల్సిందేమీ లేదు. ఎందుకంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే ఒక్క కరోనానే కాదు, ఎన్నో అంటువ్యాధులు, ఇతర రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఏం చేయాలో తెలుసుకుందాం.



ఆరోగ్యకరమైన ఆహారం మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. మాంసం, బీన్స్ వంటి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీర పనితీరును మెరుగుపరుస్తాయి. పసుపు, అల్లం, నిమ్మరసం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందువల్ల ఆహారంలో అవి ఉండేలా చూసుకోవడం మంచిది.

వ్యాయామం

క్రమం తప్పకుండా చేసే ఏ తేలికపాటి వ్యాయామం అయినా సరే,రోగనిరోధకతను పెంచుతుంది. అందువల్ల ఏమీ చేయలేకపోయినా, కనీసం నడవడం వల్ల అయినా శరీరమంతటికీ రక్తప్రసరణ పెరుగుతుంది. అన్ని కణాలకూ ఆక్సిజన్ అందుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

ఒత్తిడి లేకుండా చూసుకోవాలి

ఒత్తిడి రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది మన శరీరంలో కార్టిసాల్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది రోగనిరోధక ప్రతిస్పందనను నెమ్మదింపజేస్తుంది. ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు, యోగా వంటివి ఒత్తిడిని తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి.

ద్రవపదార్థాలు

మంచి ఆరోగ్యానికి, బలమైన రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండేందుకు శరీరం హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడానికి సహాయపడుతుంది. రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి నీరు ఎంతో సహాయపడుతుంది.

సరిపడా నిద్ర

ఆరోగ్యం బాగుండాలంటే తగినంత నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గడంతో పాటుగా ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. తక్కువ నిద్రపోయేవారికి తొందరగా జలుబు లేదా ఫ్లూ వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. సామాజిక దూరాన్ని, శుచి, శుభ్రతలను పాటిస్తూ ఉండటం, జనసమూహంలోకి వెళ్లినప్పుడు మాస్కులు వేసుకోవడం అవసరం. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకుంటే కోవిడ్ ఒక్కటే కాదు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తొందరగా దరిచేరవు.